మారుతి కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..

2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

మారుతి ఈ-విటారా:

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

నయా గ్రాండ్ విటారా

కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

కొత్త బాలెనో

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-పాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

అప్‌గ్రేడ్ బ్రెజ్జా

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంభిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ సంగతి..

సహజంగా రాష్ట్రాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతే కాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

కేసులతో రచ్చ

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరికొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మా సిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు ఆయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్ఎస్‌బీవీఎల్ ..హెల్త్ కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

టెలికం సంస్థలకు ఇక్కట్లే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

శాట్కామ్‌ల ఎంట్రీతో..

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

జంతు వధశాలల వేలం నిర్వహిస్తున్న బల్దియా అధికారులు

జంతు వధశాలల అద్దె వేలం

వరంగల్, డిసెంబర్ 28 : వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని జంతువధ శాలలకు అద్దె వేలం పాటలను బల్దియా అధికారులు శనివారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ జోనా ఆధ్వర్యంలో మూడు జంతు వధశాలలకు వేలం నిర్వహించారు. వరంగల్ జంతు వధశాల కోసం ఎనిమిది మంది కాంట్రాక్టర్లు పాల్గొనగా అత్యధికంగా రూ.7.35 లక్షల పాట పాడిన సత్యనారాయణ దక్కించుకున్నారు. హనుమకొండ జంతువధశాల కోసం ముగ్గురు పాల్గొనగా రూ.7.08 లక్షలకు సయ్యద్ జహంగీర్ దక్కించుకున్నారు. కాజీపేట జంతువధశాల కోసం ఇద్దరు పాల్గొనగా రూ.2.16 వేలకు మహ్మద్ సర్వర్ దక్కించుకున్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, గోపాల్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, సూపరింటెండెంట్ దేవేందర్, సజ్జన్‌రాజ్ పాల్గొన్నారు.

వరంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

సమ సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం

ఖిలావరంగల్, డిసెంబర్ 28: సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా సీపీఐ పని చేస్తున్నదని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషుమియా, పంజాల రమేశ్, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, రవీందర్, చంద్రకళ, రమేశ్, శంకరయ్య, చెన్నకేశవులు, యాకయ్య, రాజు అక్బర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని గుర్తుతెలియని ఒకరి ఆత్మహత్య

గీసుగొండ, డిసెంబర్ 28: ఉరేసుకొని గుర్తుతెలియని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ ధర్మారంలోని ఊర చెరువు గట్టు వద్ద ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సుమారు ఐదు రోజుల క్రితం ధర్మారంలోని ఊర చెరువు గట్టు వద్ద ఉన్న తుమ్మ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం గొర్రెలకాపరులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడు బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉబ్బిపోయి ఉందని సీఐ చెప్పారు.

31న బల్దియా కౌన్సిల్ సమావేశం

వరంగల్, డిసెంబర్ 28: ఈ నెల 30న జరగాల్సిన బల్దియా సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. పాలనాపరమైన కారణాలతో 31న నిర్వహించనున్నట్లు బల్దియా కార్యదర్శి లక్క అలివేలు తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు మేయర్ సుధారాణి అధ్యక్షతన సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

వరంగల్ తుమ్మలకుంటలో పార్కు స్థలం కబ్జా

- ఫిర్యాదు చేసిన స్థానికులు
- ప్రహరీని కూల్చివేసిన జీడబ్ల్యూఎంసీ అధికారులు
- పార్కు నిర్మాణం చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

ప్రహరీని కూల్చివేస్తున్న కార్పొరేషన్ అధికారులు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 28: వరంగల్ 12వ డివిజన్ తుమ్మలకుంటలో కబ్జాకు గురైన పార్కు స్థలంపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ స్థలంలో నిర్మించిన ప్రహరీని శనివారం జేసీబీతో కూల్చివేశారు. మరోసారి ఆక్రమణకు గురికాకుండా పార్కు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తుమ్మలకుంట సర్వే నంబర్లు 411, 422లోని డీపీ నంబర్లు 89/81 భూమిని మూడున్నర దశాబ్దాల క్రితం జీపీఏలో ఉన్న వ్యక్తి లే అవుట్ చేసి పూర్తిగా విక్రయించాడు. ఇందులో 1248 గజాల స్థలాన్ని పార్కు కోసం కార్పొరేషన్‌కు అప్పగించాడు. ఈ నేపథ్యంలో గతంలో అమ్మిన వ్యక్తికి స్థానిక నాయకుల అండంతో పార్కు స్థలాన్ని ఆక్రమించాడు. శుక్రవారం ఆ స్థలంలో ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం ఉదయాన్నే జేసీబీతో వచ్చి ప్రహరీని కూల్చివేశారు. ఈ సందర్భంగా 12వ డివిజన్ కార్పొరేటర్ కావేటి కవితా రాజు యాదవ్ మాట్లాడుతూ తుమ్మలకుంటలో పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు తన దృష్టికి రావడంతో వెంటనే కార్పొరేషన్ అధికారులకు చెప్పానన్నారు. పార్కు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

ఏపీలో కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 28: ఏపీలోని కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో ఓరుగల్లు కూచిపూడి నృత్య కళాకారుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో నృత్య ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నుంచి ప్రముఖ గురువు బొంపెల్లి సుధీర్‌రావు ఆధ్వర్యంలో 'జయ జయ దుర్గే తరంగం' కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. రాష్ట్రపతి నుంచి బాల పురస్కార్ అందుకున్న లక్ష్మీ ప్రియ, డాక్టర్ అభిజ్ఞ, శ్రుతి, కమలాక్షిత, మైత్రి, స్నిగ్ధ, సహస్ర పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు. సంస్థ నిర్వాహకులు వేదాంతం రాఘవయ్య, వేదాంతం వెంకట చలపతి, కూచిపూడి నాట్యాచారిణి డాక్టర్ వనజా ఉదయ్ కళాకారులను ప్రశంసించారు.

ప్రభుత్వ విప్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

కేయూ జేఏసీ చైర్మన్ కే దామోదర్

ఖిలావరంగల్, డిసెంబర్ 28: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రకులాల నాయకత్వంపై మాట్లాడిన తమరు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం కిందే పని చేస్తున్నట్లు గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ చేసిన రేవంత్‌రెడ్డి అందుకు కట్టుబడి ఉండాలని, ఈ నెల 31లోగా బీసీ జనగణన సర్వే చేస్తామని చెప్పి అస్తవ్యస్తం చేశాడని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని బీసీ కులాలు, కుల వృత్తులకు అండగా ఉన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీసీలు కార్యాచరణ ప్రకటిస్తే దానికి మద్దతు పలకడానికి కల్వకుంట్ల కవిత వస్తే.. మీకు వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జల్లి విద్యార్థి

చెన్నారావుపేట, డిసెంబర్ 28: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు మండలంలోని జల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పోలోజు రామ్‌చరణ్ ఎంపికైనట్లు ఎంఈవో, హెచ్ఎం సరళ శనివారం తెలిపారు. అతడు జిల్లాస్థాయిలో 60 కేజీల విభాగంలో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. ఈ నెల 30, 31వ తేదీల్లో హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రామ్‌చరణ్ పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు నాగేశ్వరచారి, జగన్మోహన్, వెంకటేశ్వరరావు, సరిత, అశోక్, శైలజ, అనిత, సుభాష్, పద్మావతి అభినందించారు.

నాణ్యమైన మిర్చికి గిట్టుబాటు ధర

మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల

కాశీబుగ్గ, డిసెంబర్ 28: నాణ్యమైన మిర్చిని తీసుకొచ్చి వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గిట్టుబాటు ధర పొందాలని మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల రైతులను కోరారు. శనివారం ఆమె 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ మిర్చిని బాగా ఎండబెట్టి, తేమ, చెత్తాచెదారం లేకుండా, శుభ్రపర్చిన తర్వాతే మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. నాణ్యమైన మిర్చి నుంచి తాలు, పాలకాయ(పండుకాయ)ను వేరు చేసి తీసుకొస్తే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. పాడైన, మంచి మిర్చిని ఒకే బస్తాలో తీసుకొస్తే మంచి ధర రాదన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారని సూచించారు. మిర్చిని బస్తాల్లో నింపే క్రమంలో తేమ లేకుండా, ఎక్కువగా తొక్కకుండా తీసుకురావాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకనుగుణంగా మన మార్కెట్ యార్డుల్లో ధరలు నిర్ణయిస్తారన్నారు. ఇక్కడ ధర నచ్చకపోతే వెంటనే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని వివరించారు. తేమ అధికంగా ఉన్న మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తే రంగు మారి నాణ్యత చెడిపోయే ప్రమాదం ఉందన్నారు.

రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్

ఖిలావరంగల్, డిసెంబర్ 28: ప్రమాదాలు జరిగితే ఎలా కాపాడాలో తెలియజేసేందుకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రమాదంలో గాయపడిన వారిని ఎలా రక్షించాలో ఆర్పీఎఫ్ పోలీసులు కళ్లకు కట్టినట్లు చూపించారు.

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆర్టీఏ కార్యాలయంలో రద్దీ

ఖిలావరంగల్, డిసెంబర్ 28: వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో శనివారం రద్దీ నెలకొంది. శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణించడంతో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో స్లాట్ బుక్ చేసుకున్న వాహనదారులు శనివారం రవాణా శాఖ కార్యాలయానికి వచ్చారు. శుక్ర, శనివారాల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారు కార్యాలయానికి చేరుకోవడంతో కౌంటర్లు కిక్కిరిసిపోయాయి.

కౌంటర్లలో కిక్కిరిసిన వాహనదారులు

మేయర్ సుధారాణికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

షాపింగ్ మాల్ అనుమతులు రద్దు చేయాలి

- బల్దియా కౌన్సిల్ ఎజెండాలో చేర్చాలి
- మేయర్‌ను కలిసిన కార్పొరేటర్లు

వరంగల్, డిసెంబర్